

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

సగటు మనిషి

"ఏమండోయ్. మా అమృత వస్తోందిట" లలిత ఉత్సాహంగా చెప్పింది.

రాజశేఖర్ భార్య నోటి వెంట ఈ అమృత పేరు అనేకసార్లు విన్నాడు. లలిత అమితంగా ప్రేమించే, ఆరాధించే స్నేహితురాలు అమృత. తమ పెళ్ళి రోజే అమృత పెళ్ళి కూడా అవ్వటంతో, ఇద్దరూ ఒకరి పెళ్ళికి మరొకరు వెళ్ళలేదు. తమ పెళ్ళిని ముందుకో, వెనక్కో జరపాలని, లలిత చాలా ప్రయత్నించింది కానీ, ముహూర్తాలు కుదరలేదు. ఆ తర్వాత ఇన్నేళ్ళు కలవటం కుదరలేదు.

"నేను చెప్పింది విన్నారా?" లలిత భర్త మొహంలోకి చూస్తూ అడిగింది.

"ఆ. విన్నాను. ఇంతకీ మీ అమృత ఎందుకు వస్తోంది?" రాజశేఖర్ కంప్యూటర్ నించి దృష్టిని మళ్ళించి అడిగాడు.

"వాళ్ళాయనకి మన ఊళ్ళో ఏదో రిఫ్రెషర్ కోర్సు ఉందిట. తను కూడా ఆయనతో వచ్చి మనింట్లో ఉంటానని ఫోన్ చేసింది. వారం రోజుల ట్రైనింగ్ ప్రోగ్రాం అట. సోమవారం వస్తుంది" లలిత కళ్ళు మిలమిలా మెరుస్తుండగా, ఉద్వేగంగా చెప్పింది.

"అయితే వారం రోజులు నాకు కనపడవన్నమాట" రాజశేఖర్ నవ్వాడు.

"ఛా. అదేం మాట. మిమ్మల్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తాను? బాత్రూముకి వెళ్ళాలా? తీసుకెళ్ళనా?" లలిత భర్త భుజం మీద చెయ్యివేసి, ఆప్యాయంగా అడిగింది.

"అవసరంలేదు కానీ, వేడిగా కాఫీ తెచ్చిస్తావా? పది నిమిషాల్లో మీటింగ్ ఉంది. అదయ్యాక భోజనం చేద్దాం" రాజశేఖర్ కోరాడు.

"అలాగే. అరకప్పే ఇస్తాను. లేకపోతే అన్నం సరిగ్గా తినరు. మీకు ఇష్టమని ఇవాళ గోంగూర పచ్చడి, గుత్తివంకాయ కూర చేసాను" చెప్పి లలిత వంటగదిలోకి వెళ్ళింది.

ఆదివారం రాత్రి లలిత సరిగ్గా నిద్రపోలేదు. స్నేహితురాలుండే వారం రోజులు, రోజు ఏం చేయాలో, ప్రోగ్రాంని ఫోన్లో రాసుకుంది. ఇద్దరికీ ఒకేలాంటి చీరలని ఆన్‌లైన్లో బుక్ చేసింది.

సోమవారం ఉదయం ఏడున్నరకి డోర్ బెల్ మోగింది. లలిత ఒక్క ఉదుటున వెళ్ళి తలుపు తీసింది.

"లల్లీ!" లోపలికి వచ్చిన అమృత ఆమెని ఆలింగనం చేసుకుంది.

"అమ్మూ. ఆరింటికే లేచి నీకోసం చూస్తున్నాను" లలిత సంతోషంగా చెప్పింది.

ఈ హడావుడికి మెలుకువ వచ్చిన రాజశేఖర్, కళ్ళు మూసుకుని వారి మాటలు వింటుండి పోయాడు.

"ఎయిర్‌పోర్ట్ నుంచి ఒక్కదానివే వచ్చావా? తను దింపి వెళ్ళారా?" లలిత అడిగింది.

"వాళ్ళ ట్రైనింగ్ సెంటర్ ఈస్ట్ అయితే మీ ఇల్లు వెస్ట్. చెరో టాక్సీ ఎక్కాం" అమృత చెప్పింది.

"అబ్బ! కొత్త ఊళ్ళో ఒక్కదానివే భలే వచ్చేసావే. నేనైతే పక్కన తోడు లేకుండా బయటికే అడుగుపెట్టను" లలిత గొంతులో ఆరాధన.

"ఏం భయం? ఒక్కదాన్ని ప్రయాణాలు చేయడం నాకు అలవాటే" అమృత తేలిగ్గా చెప్పింది.

"కాఫీయా? టీయా? అయ్యో. ఒక నిమిషం. రాజా లేచారేమో చూసొస్తాను" లలిత బెడ్రూంలోకి వెళ్ళింది.

భర్తని బాత్రూంకి తీసుకెళ్ళి, బయట వేచి ఉండి, అతను బ్రషింగ్ చేసి వచ్చాక, చేయి పట్టుకుని ముందు గదిలోకి తీసుకెళ్ళింది.

"అమ్మూ. మావారు రాజశేఖర్. ఏమండీ, అమ్మూ" ఇద్దర్నీ పరస్పరం పరిచయం చేసింది.

"మీ పెళ్ళికి ముందునించే మిమ్మల్ని చూడాలని. సెక్రటరీలో రాజశేఖర్‌లా ఉంటారా లేదా అని. లల్లీని జయంతి అని పేరు మార్చుకోమని చెప్పా కూడా" అమృత హుషారుగా చెప్పింది.

రాజశేఖర్ చిరునవ్వు నవ్వాడు.

"చెప్పాగా. తన ఎడమ కాలు మడమ దగ్గర ఫ్రాక్చర్ అయింది. రోడ్డు దాటుతుంటే బైక్ వాడు గుద్దాడు. రెండు వారాలైంది. ఇంట్లోంచే పనిచేస్తున్నారు" లలిత చెప్పింది.

"అయ్యో. రోడ్డు మీద నడవటం ఇప్పుడు సర్కస్‌లో తాడు మీద నడవటమంత సాహసం రాజాగారు.." అమృత తనకి తెలిసిన అలాంటి యాక్సిడెంట్స్ గురించి చెప్పింది.

"నేను లాగిన్ అవుతాను. మీ ఫ్రెండ్స్ కబుర్లు చెప్పుకోండి" బ్రేక్‌ఫాస్ట్ తిన్నాక రాజశేఖర్ భార్య సహాయంతో పడకగదిలోకి వెళ్ళిపోయాడు.

అమృత వచ్చినప్పటినించి వారి ఇల్లు నవ్వులతో మారుమోగిపోతుంది. ఇంట్లోనే ఉండటం వల్ల రాజశేఖర్ ఆమె ఉత్సాహం, చురుకుదనం, తెలివి, సమయస్ఫూర్తి, లోకజ్ఞానం అన్నీ గమనించి ఆశ్చర్యపోయాడు. లలితలో ఆ గుణాలు లేనందుకు పెళ్ళైన ఇరవై రెండేళ్ళకి అతనికి అసంతృప్తిగా అనిపించింది.

ఇంత సంరంభంలో, కూడా లలిత భర్త సేవలని నిర్లక్ష్యం చేయలేదు. అమృతతో బయటికి వెళ్ళినా అన్ని అమర్చి వెళ్ళింది. అయినా ఏదో అసంతృప్తి. తమ పెళ్ళిరోజే పెళ్ళి చేసుకున్న అమృత భర్తమీద అతనికి బయటకి చెప్పుకోలేని అసూయ కలిగింది.

"నువ్వు నాతో మాట్లాడుతూనే ఉంటావు. నా మాటలు వింటూనే ఉంటావు. అయినా మొబైల్లో ఏదో చేస్తుంటావు. టైప్ చేస్తుంటావు. అసలు నేను చెప్పేది వింటున్నావా?" లలిత ఒకరోజు స్నేహితురాలిని అడిగింది.

"ఎందుకు వినటం లేదు? మీ వాడికి ఆరు యూనివర్సిటీల్లో సీటు వచ్చింది. నాలుగు స్కూల్స్ స్కాలర్షిప్ ఆఫర్ చేసాయి. చివరికి వాటిలో ఒకటి సెలెక్ట్ చేసుకుని వెళ్ళాడు. నీ పుత్రోత్సాహం అంతా వింటున్నా. ఫోన్‌లో స్టాక్స్ చెక్ చేసుకుని, రెండు మూడు తక్కువగా కోట్ అయితే కొంటున్నా. రేటు పెరిగినవి రెండు అమ్మేసా" అమృత చెప్పింది.

"అమ్మో. నాకవేం తెలియదు. నీకు ఫైనాన్షియల్ విషయాలు బలే తెలుసు" లలిత ఆశ్చర్యపోయింది.

"మరి? అనిల్ మంత్రీ జీతం కన్నా ఎక్కువ సంపాదిస్తా తెలుసా?"

"ఈవిడలో ఈ కోణం కూడా ఉందన్నమాట" అనుకున్నాడు రాజశేఖర్. లలితకి మనీ మేనేజ్మెంట్ అసలు తెలియదు. అన్నీ తనే చూసుకోవాలి.

"రాజాగారు. ఈ రోజు వంట నేనే చేసాను. వచ్చి తిని ఎలావుందో చెప్పాలి" అమృత వంటగదిలోంచి అరిచింది.

"అమృతంలా ఉందనా?" అప్రయత్నంగా అడిగాడు.

తరువాత సిగ్గుపడ్డాడు. స్వతహాగా మితభాషి అయిన రాజశేఖర్, కొత్తవాళ్ళతో చొరవగా మాట్లాడలేడు. అలాంటిది, తన భార్య స్నేహితురాలితో అలా మాట్లాడటం అతనికి వింతగా అనిపించింది.

"అమ్మూ నీ మాటల మహత్యం. మావారు కూడా జోక్స్ వేస్తున్నారు" లలిత నవ్వింది.

నిజంగానే అమృత వంట అమృతంలా ఉంది. లలిత ఎన్నడూ చేయని వెరైటీ వంటలు.

"అన్నీ రుచిగా ఉన్నాయి. లలిత ఎప్పుడూ సాంప్రదాయ వంటలే చేస్తుందండి. కొత్త వంటలు ట్రై చేయదు" చెప్పాడు.

అతనికి భార్యమీద అసంతృప్తిగా అనిపించింది. అమృత భర్త మీద అసూయ కలిగింది.

భోజనం అయ్యాక రాజశేఖర్ బెడ్రూములోకి వెళ్ళిపోయాడు.

"మనం రేపు పొద్దున్నే ఏదైనా మాల్‌కి వెళ్ళి, కొద్దిసేపు విండో షాపింగ్ చేసి, అక్కడే తిని, సినిమా చూసి వద్దాం. ఊరికి వెళ్ళాక, ఎవరి రొటీన్ వాళ్ళదే. డిగ్రీ చదివేప్పుడు ఏం తిరిగేవాళ్లమో కదూ?" అమృత అడిగింది.

"అంతసేపా? మా వారికి కష్టంవుతుంది అమ్మూ" లలిత ఇబ్బందిగా చెప్పింది.

"ఒక్క పూటకి ఏమవుతుంది? లంచ్ టైంకి ఆయనకి ఏదైనా ఆర్డర్ చేద్దాంలే. మరీ పతివ్రతలా వేషాలు" అమృత నవ్వింది.

"లేదు. భోజనం గురించి కాదు. తన కాలు బాలేదు. ఎవరైనా బెల్ కొట్టినా, వచ్చి తలుపు తీయలేరు. బాత్రూంలోకి వెళ్ళాలన్నా కష్టమే. రెండు మూడు గంటలంటే ప్రాబ్లం లేదు" లలిత చెప్పింది.

"అంటే ఆయనకి యాక్సిడెంట్ అయినప్పటినించి నువ్వు ఎక్కడికి వెళ్ళలేదా?" అమృత ఆశ్చర్యపోయింది.

"రోజూ నీతో వస్తున్నాగా. అలాగే అవసరమైతే తప్పదు. కాకపోతే ఎక్కువసేపు బయట ఉండటం ఇష్టంలేదు. తను ఏమి అనరు. కానీ నాకే గిల్టీగా ఉంటుంది. కావాలంటే టైంకి వెళ్ళి సినిమా చూసొద్దాం."

"సతీ లలిత" అమృత నవ్వింది.

"నువ్వేమైనా అనుకో" లలిత కూడా నవ్వింది.

"చదువుకునే రోజుల్లో ఎంత రెబెల్‌గా ఉండేవాళ్ళం లల్లీ? పెద్దవాళ్ళని లెక్కచేసేవాళ్ళం కాదు. మనిష్టం వచ్చినట్లు ఉండేవాళ్ళం" అమృత అసంతృప్తిగా చెప్పింది.

"అప్పుడు టీనేజ్‌లో ఉన్నాం. ఇప్పుడు నలభైలలో అమ్మల స్థానంలో ఉన్నాం. నిన్నేగా లవ్ స్టోరీస్ సిల్లీగా ఉంటున్నాయి అనుకున్నాం. మనం ఎదిగాం. ఆ మెచ్యూరిటీని ఇగ్నోర్ చేసి, చిన్న పిల్లల్లా ఉండాలన్నా ఉండలేం."

లలిత విశ్లేషణకి రాజశేఖర్ ఆశ్చర్యపోయాడు. ఆమె గదిలోకి వచ్చినప్పుడు చెప్పాడు.

"అమృత ముచ్చట పడుతోందిగా, వెళ్ళు. ఒక్కరోజేగా. ఎలాగో అడ్జస్ట్ అవుతాను. అవసరమైతే వాచ్‌మేన్ని పిలుస్తా."

"వద్దు, నాకు నచ్చదు. వెళ్ళినా మీరేమి ఇబ్బంది పడుతున్నారో అనే ఆలోచిస్తాను" లలిత స్థిరంగా చెప్పింది.

శుక్రవారం ఇద్దరూ సినిమాకి వెళ్ళి వచ్చారు.

"అబ్బా. పరమచెత్త సినిమా" వస్తూనే అమృత సోఫాలో వాలిపోయింది.

"ఒక్క నిమిషంలో వస్తా."

లలిత పడకగదిలోకి వెళ్ళి, రాజశేఖర్ని పలకరించి, వంటగదిలోకి వెళ్ళి, కాఫీ కలిపి, అమృతకి, భర్తకి అందించింది.

"బాబోయ్! అదేం సినిమా లల్లీ? ఆ హీరోయిన్ ఏమిటి, బుద్ధిలేకుండా రౌడీ వెధవని ప్రేమించి, పేరెంట్స్‌ని ఎదిరించి..ఛా, నాకు నచ్చలేదు" అమృత కాఫీ తాగుతూ చెప్పింది.

లలిత నవ్వింది.

"నిన్న నేను చెప్పిన మెచ్యూరిటీ అదే. టీనేజ్‌లో ఈ సినిమా చూసి ఉంటే, హీరోయిన్ని సపోర్ట్ చేసేవాళ్ళం. ఇప్పుడు పేరెంట్స్ ని సపోర్ట్ చేస్తాం. ఎందుకంటే మనకి హీరో హీరోయిన్స్‌లో మన పిల్లలు కనపడతారు. వాళ్ళు అలా చేస్తే అనే సందేహం వచ్చి సినిమా నచ్చదు."

"వావ్ లల్లీ. భలే అనలైజ్ చేశావు." అమృత చప్పట్లు కొట్టింది.

రాత్రి ఎనిమిదవుతుండగా ఆమె భర్త అనిల్ వచ్చాడు.

"ఏంటప్పుడే వచ్చేశావు? పార్టీ లేదా?" అమృత అతన్ని చూసి అడిగింది.

"ఉంది, నాకే ఉండాలనిపించక వచ్చేసాను" అనిల్ చెప్పాడు.

అమృత వాళ్ళకి భర్తని పరిచయం చేసింది. అనిల్ నెమ్మదిగా, మొహమాటస్థుడిలా ఉన్నాడు.

ఆదివారం మధ్యాహ్నం వాళ్ళు వెళ్ళిపోయారు.

"వారం రోజులు భలే సందడిగా గడిచిపోయాయి కదండీ" లలిత భర్తని అడిగింది.

"అవును. నువ్వూ, నీ స్నేహితురాలు ఇంకో పదేళ్ళకి సరిపోయే కబుర్లు చెప్పుకున్నారు" రాజశేఖర్ నవ్వాడు.

"అమృతలో మార్పేలేదు. తను ఇప్పటికీ అలాగే ఉంది. కాలేజ్ రోజుల్లో మేమిద్దరం కలిసి తిరిగినా, నన్నెవ్వరూ పట్టించుకునే వాళ్ళు కాదు. అమృత అయస్కాంతంలా అందరినీ ఆకర్షించేది. ఆ చొరవ, చురుకుదనం నాకు లేవు. తనకి ఎంతమంది ప్రపోజ్ చేసారో. బహుశా మీరు కూడా అనుకుంటుండొచ్చు, లలిత కన్నా అమృత తెలివైంది, మేధావి, బాగా వంట చేస్తుంది అని" లలిత కొద్దిగా అసూయ నిండిన కంఠంతో చెప్పింది.

రాజశేఖర్ ఆమె చేతిని అందుకుని ముద్దుపెట్టుకుని చెప్పాడు.

"లేదు. లేదు. నాకు నువ్వే నచ్చావు. ఇంకా ఇప్పుడు ఎక్కువ నచ్చావు."

లలిత సంతోషంగా నవ్వింది.

"నిజంగానా?"

"నిజంగా" చెప్పాడు.

తర్వాత ఆ యాభై మూడేళ్ళ భర్త అనుకున్నాడు.

'అమృతకి ఎన్ని మంచి లక్షణాలున్నా, ఆమె భర్తని ఏకవచనంలో పిలుస్తోంది. అతనికి అస్సలు విలువ ఇవ్వటం లేదు. కరివేపాకులా తీసేస్తోంది. భర్తంటే బొత్తిగా గౌరవం లేదు. తను ఇలాంటి వాళ్ళని నిమిషం కూడా భరించలేడు.

తనతో మేనమామ కొడుకుతో మాట్లాడినట్లు చనువుగా మాట్లాడింది. లలిత పరాయి మగాళ్ళతో ఎన్నడూ అలా మాట్లాడదు. విరగబడి నవ్వదు. సమర్థత లేకపోయినా లలిత బంగారం. ఈ జన్మకి ఈ భార్య చాలు.'

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments